కథానిక

# నీటి బిందువు

"జయంతి"

ఆఖరికి తనూ ఒకమనిషే. చిలక్కొయ్యకాదు-ఏగోడకో తగిలించి వుంచడానికి. వయసురాని పిల్ల కాదు. అనుభవంలేని అజ్ఞానురాలు కాదు. వంటిల్లే లోకంగా భావించే విద్యావిహీన కానే కాదు. మరి ఏమిటీ చులకన! రాను రాను సంసారంలో తనమాటకు విలువలేకుండా పోతూంది. ఏం మాట్లాడినా భర్త లెక్క చెయ్యడు. తనకూ ఈ లోకాన్ని చూడాలని వుందని గ్రహించడు, ఎప్పుడూ కథలూ, పాటలూ రాసుకుంటూ కూర్చుంటాడు. కడకి వాటికంటే కూడా తను తీసిపోయిందా?

విజయ ఉమాపతిని వింతసంఘటనల్లో పెళ్లాడింది. అతడు కాలేజీలో రెండుక్లాసులు సీనియరు. అప్పటికే కథలూ, పద్యాలూ రాస్తూండేవాడు. ఒకనాడు కాలేజీలో ప్రత్యేక సభ ఏర్పాటుచేసి అందరూ అతన్ని గౌరవించేరు. అందులో తానూ పాల్గొంది. ఆనాటినుండీ అతనంటే ఒక అభిమానం, అభిలాష, అనురాగం ఎక్కువకాగా, ధనరాసులతో వచ్చిన యువక బంధరాలని దులుపుకుంటూ కడకు అతన్నే పెళ్ళిచేసుకుంది. ఆదిలో స్వర్గసీమగా తోచిన ఆమె వైవాహికజీవితం పదేళ్లు గడిచాక ఇట్లా పరిణమించింది. ఒకనాడు దైవసముడుగా తోచిన ఉమాపతి ఈనాడు శిలాసదృశుడుగా కూడా ఒక్కొకసారి గోచరిస్తాడు. సున్నితమైన యౌవనపుటుద్రేకాలు చల్లారుతూ, ముగ్ధమోహపడిలో పడుతూన్న విజయలో ఎన్నోమార్పులు కలిగాయి. మొదట్లో అతని యిష్టానుసారం నడచుకుంటూన్న తాను, స్వాభిమానం ఎక్కువకాగా భర్త తన యిష్టానుసారం ఎందుకు మారకూడదనుకుంటుంది. ఈ మార్పులు ఆమెకు తెలియకుండా రావడమే ఈ కష్టనిష్ఠూరాలకి మూలకారణం.

"ఏం విజయా, అలా మందంగా వున్నారేం!"

"ఏమీలేదు రాజారావుగారూ, నవ్వులపాలై పోతూన్న నా జీవితాన్ని గూర్చి వితర్కించుకొంటున్నాను."

"అదేమండీ, సుఖదుఃఖాలు అరచేతిలో పెట్టుకుని అలా దిగ్భ్రాంతి పొందుతారు!"

"నా జీవితమే ఒక జీవితం!"

రాజారావుకి చిరకాలపువాంఛ ఫలించినట్లయింది.

"అలా గనకండి. సుఖపడటం చాలామందికి తెలియదు. బ్రతుకే ఒక పూలబాట, ఆనంద సముద్రం. చూడండి- గడచిపోతూన్న ఈ దినాలు, నడచిపోతూన్న లోకానుభవాలూ మళ్ళీ వస్తాయా? మత్తెక్కించే కోకిలగానం, మైమరపించే పుష్పసౌరభం అనుభవించలేని నిర్భాగ్యులెందరు లేరీ లోకంలో."

విజయ మౌనంగా, వెర్రిగా తల వూపుతోంది.

"ఒక్కొకరోజు గడచినకొద్దీ మన వయస్సు ముదురుతోంది. కొన్ని సుఖాలు వెనకంటుతున్నాయి. ఇవన్నీ అనుభవించలేని మానవజన్మ సంపూర్ణం కాలేదు."

విజయకి ఒళ్లు తెలియలేదు. రాజారావెంత మంచివాడా అనిపించింది. ఈ ఇంగితజ్ఞానమే తన భర్తకుంటే!

రాజారావు మళ్ళీ అందుకున్నాడు.

"లోకంలో రెండుతెగల మనుష్యులు. ఒకరు పరిస్థితులబట్టి మారుతారు. ఇంకొకరు పరిస్థితులను తమతోనే మార్చుకుంటారు."

విజయకి జ్ఞానోపదేశం చేసిన ట్లయింది. పరిస్థితులని బట్టి తాను మారడం అసహజంగానూ, అవమాన కరంగానూ తోచింది.

"అన్నట్లు ఈవేళ సంధ్యారాణిగారి నృత్య ప్రదర్శనం వుంది. మీరు పోతున్నారా?" అన్నాడు రాజారావు.

"మే మెక్కడికి పోయేది? సినిమా చూచి నెలా ళ్లయింది."

"అదేం?"

"ఎవరికని చెప్పేది! ఆ యన క థ లూ, పాటలూ రాసుకుంటూ ఇల్లు కదిలితేనా!"

"ఆయన కదలక పోతే మీరు కదలకూడదని ఎక్కడుంది? ఆ బలహీనతవల్లనే మీరింత బాధ పడుతున్నారు."

విజయ ఈ విషయాన్ని గురించి ఎన్నడూ యోజించలేదు. భర్తరాకపోతే తాను ఒంటరిగా ఎందుకు పోకూడదు?

"నేను సాయంత్రం నృత్య ప్రదర్శనానికి వెడుతున్నాను. పోనీ మీరైనా ఎందుకు రాకూడదూ?"

అప్రయత్నంగానే విజయ "సరే, తప్పకుండా వస్తాను" అనేసింది. ఉమాపతి నిర్లక్ష్యాని కిదే ప్రతీకారం అనుకుంది.

రాజారావు ఆనంద మనస్కుడై ఇంటిదారి పట్టేడు. ఒకనాడు విజయ కనురెప్పల చాటున రెపరెపలాడిన తన ఆశాజ్యోతులు ఈనాడు దేదీప్యమానంగా వెలగబోతున్నాయని సంతోషించేడు. 'తన అదృష్టానికి తానే కర్త' అనే అతనివాదం పూర్ణజయాన్ని సాధించిన ట్లయింది. కాలేజీ దినాల్లోతన ప్రసక్తికే విముఖత్వం చూపిన విజయ కాలగమనంలో తనకు సుముఖ కాగలదని కలలోకూడా అతడు తల పోయలేదు. ఇంతకాలం అతనిలో నిద్రాణమై వున్న యౌవనపుటుద్రిక్తత నేడు విజృంభించింది. లోకంలో అందరు పురుషులూ తనలాగే ఆనందంగా వుంటే ఎంత బాగుండును!

సీట్లు రిజర్వు చేయించుకుని సాయంత్రం ఆరు గంటలకి రాజారావు ఉమాపతి యింటికివచ్చాడు. విజయ భర్తతో నవ్వుకుంటూ కారులో కూర్చుంది.

"రండి రాజారావుగారూ, నృత్యప్రదర్శనానికి-" రాజారావు తలమీద పెద్ద బండ పడినట్టయింది. "మీ బావగారికి సన్మానంకూడా వుంది. రండి పోదాం."

"ఏం సన్మానం?"

"ఆయన వ్రాసిన కొన్ని పాటలవరుసలలో సంధ్యారాణి నాట్యం సలుపుతుందట- అందుకు. ఆమె స్వయంగా ఇక్కడికి వచ్చి మాకు కాంప్లిమెంటరీలు ఇచ్చింది."

"చాలా సంతోషం. అభినందనాలు ఉమాపతిగారూ. కొంచెం పని వుంది. చూసుకొని అక్కడే కలుసుకుంటాను" అన్నాడు రాజారావు.

కారు కదిలింది భార్యాభర్తల చిరునవ్వులతో. టిక్కట్లు నలుపుకుంటూ రాజారావు మందంగా నడక సాగించాడు.

ఇంతలో ఎవరో వెనకనుండి "రాజారావుగారూ! ఏమిటి విశేషాలు?" అన్నారు.

"ఏముున్నాయి—స్త్రీ చిత్తం నీటిబిందువు. అది అమృతంగానూ మారగలదు, విషంగానూ మారగలదు" అన్నాడు పరధ్యానంగా.

---

అల్లుడు:- నాకు ఎప్పుడేనా డబ్బు అవసరమైతే ఏవిధంగా నిన్ను అడిగితే లభిస్తుంది?

మామ:—అలాగా! నీకు ఎంత డబ్బు కావాల్నో మొదలైన వివరాలు ఒక కాగితంమీద వ్రాసి నాకు యివ్వడం, ఆ తర్వాత నేను పంపిన జవాబు చదవకుండా చింపివేయడం- లేకపోతే నీ లేత మనస్సు బాధపడుతుంది!